ప్రజాశక్తి

బుధవారం ఏప్రిల్ 17 2024 8 పేజీలు

శ్రీకాకుళం

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

శ్రీకాకుళం అర్బన్ : పలాస మండలం కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తమ్మినాన మన్మథరావును సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు విచారణలో తేలినందున ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు.

టిడిపిలో అనిశ్చితి

- రెండు నియోజకవర్గాల్లో డోలాయమానంలో కేడర్
- క్రియాశీల రాజకీయాలకు దూరంగా 'గుండ' కుటుంబం
- చంద్రబాబును కలిసిన తర్వాత ప్రకటన
- పాతపట్నంలోనూ ఏమీ తేల్చుకోలేని స్థితిలో కేడర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సాధారణ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం సమీపిస్తున్న తరుణంలో టిడిపి శ్రేణుల్లో ఇంకా అనిశ్చితి తొలగలేదు. జిల్లాలో అభ్యర్థులను మార్పు చేసిన రెండు చోట్ల ఈ పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళం నియోజక వర్గానికి గొండు శంకర్, పాతపట్నానికి మామిడి గోవిందరావును టిడిపి అభ్యర్థులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. వీరిని మారుస్తారంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, కేడర్ చివరి వరకు ఆశలు పెట్టుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పలాస వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అభ్యర్థుల మార్పు ఉండదని స్పష్టం చేశారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ దంపతులను మంగళవారం పలాస పిలిపించుకుని అదే విషయం చెప్పినట్లు తెలిసింది. నియోజకవర్గంలో అసమ్మతిని ప్రోత్సహించిన వారికే టిక్కెట్ ఇచ్చిన నేపథ్యంలో తాము పని చేయంలో వంని చంద్రబాబు ముందే వారు తేల్చి చెప్పినట్లు సమాచారం. పాతపట్నం టిడివి ఇన్‌ఛార్జి కలమట వెంకట రమణకు చంద్రబాబు నుంచి కబురు పంపినా, సకాలంలో ఆయన చేరుకోలేకపోయారని తెలిసింది.

గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి

కలమట

ప్రజాగళం సభలో పాల్గొనేందుకు ఈనెల 15న పలాస వచ్చిన చంద్రబాబు, 16న ఉదయం సుమారు 11 గంటల వరకు గడిపారు. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో (మిగతా...2లో)

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

నీటిఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. మంచినీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా అంశాలపై ప్రతిరోజూ నిశితంగా పరిశీలించి, నిరంతరాయంగా వాటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు నిధులు అందుబాటులో ఉంచామని, ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా 24 గంటల్లో సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలో వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజరీ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ఆరోగ్య సదుపాయాలను పెంచడంతో పాటు వేడిగాలులు ఎక్కువగా ఉన్న సమయంలో చేయకూడని పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు, పెంచిన కూలి గురించి జిల్లా గణాంకాలను వివరించారు. సమావేశంలో జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వరరావు, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, వంశధార ప్రాజెక్టు ఎస్ఇ డోల తిరుమలరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇంజినీరు పి.సుగుణాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జాన్ బెనహర్, నీటిపారుదల శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్ పాల్గొన్నారు.

సైకత శ్రీరాముడు

శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని సంగమయ్య కొండ దిగువున సైకత శిల్పి గేదెల హరికృష్ణ శ్రీరాముని సైకత శిల్పం వేశారు. శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

సివిల్స్‌లో వెంకటేష్‌కు 467వ ర్యాంకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వెంకటేష్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

యుపిసిఎస్‌సి మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బాన్న వెంకటేష్‌కు 467వ ర్యాంకు దక్కింది. ఈయన తండ్రి చంద్రరావు ధాన్యం వ్యాపారం చేస్తుండగా, తల్లి రోహిణి గృహిణి. ఈయన ఒకటి నుంచి మూడో తరగతి వరకు సొంత గ్రామం అల్లాడలో చదివారు. మూడు నుంచి పదో తరగతి వరకు అంపోలు రోడ్డులోని శర్వాణి స్కూల్‌లో అభ్యసించారు. విశాఖలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివారు. ఆ తర్వాత తమిళనాడులోని తిరుచునూర్‌లో నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సు చేశారు. చెన్నైలో రెండేళ్ల పాటు ఓ బొగ్గు గని కంపెనీలో పనిచేశారు. తర్వాత (మిగతా...2లో)

డొంకూరులో సముద్రంలో వేట సాగిస్తున్న ఒడిశా మత్స్యకారులు

వేట నిషేధం ధిక్కరణ

- సరిహద్దు ప్రాంతాల్లో ఒడిశా మత్స్యకారుల చేపలవేట
- స్థానిక మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఒడిశాకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపల వేట నిషేధాన్ని యథేచ్ఛగా ధిక్కరిస్తూ వేటను కొనసాగిస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (మిగతా...2లో)

అభ్యర్థుల ఖర్చులు పక్కాగా నమోదు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

(...2లో)

14 ఏళ్ల పాలనలో ఏం చేశారు?

- అప్పుడు జిల్లా అభివృద్ధి గుర్తుకు రాలేదా?
- చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరు
- రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జిల్లాకు చేసిన అభివృద్ధి పనులు ఏమిటని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. అప్పుడు రాని జిల్లా అభివృద్ధి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని అన్నారు. స్థానిక ప్రగతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల (మిగతా...2లో)

రేపట్నుంచి నామినేషన్ల ప్రక్రియ

- నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు
- జిల్లా కేంద్రంలో ఎంపీ అభ్యర్థుల నామినేషన్
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత అదే రోజు నామినేషన్ ప్రక్రియ మొదలు కానుంది. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో, లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులు జిల్లా కేంద్రంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్లను ఉదయం పది నుంచి (మిగతా...2లో)

మత్స్యకారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వేట నిషేధాన్ని ధిక్కరిస్తే చర్యలు

మత్స్యశాఖ డీడీ పి.వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నౌపడ

చేపల వేటపై ప్రభుత్వం జూన్ 14వ తేదీ వరకు నిషేధం విధించిందని మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కాలంలో వేట నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. సంతబొమ్మాళి మండలం భావనపాడులో చేపల వేట నిషేధం అమలు తీరుతెన్నులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బోటు యజమానులు, మత్స్యకారులతో మాట్లాడుతూ మత్స్య సంపద వృద్ధికి మత్స్యకారులు సహకరించాలన్నారు. సంప్రదాయ తెప్పలకి చేపల వేట నిషేధం నుంచి మినహాయింపు ఉందన్నారు. చేపల వేట నిషేధం ముఖ్య ఉద్దేశం మత్స్య సంపదను పెంపొందించడమేనన్నారు. వేట నిషేధాన్ని ఉల్లంఘించిన వారు సెక్షన్ 1994 (4) ప్రకారం శిక్షార్హులు అని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు వేట నిషేధిత సమయంలో వేటకు వెళ్లిన వారికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయం నిలిపివేస్తామని హెచ్చరించారు. దీంతోపాటు రూ.2,500 జరిమానా విధిస్తామన్నారు. సముద్రంలో పట్టిన చేపలను వేలం వేస్తామని, పడవలు, వలలు సీజ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మెరైన్ ఎఎస్ఐ ఎం.ఆర్.కె రెడ్డి, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ఆదినారాయణ, ఫిషరీస్ అసిస్టెంట్ ఎల్.దామోదర్, సాగరమిత్ర శ్రీకాంత్, మత్స్యకారులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు సన్నద్ధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 18వ తేదీ నుంచి సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు రిటర్నింగ్ అధికారులందరూ సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. విజయవాడ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, రోజువారీ నివేదికల పంపిణీ, ఎపిక్ కార్డుల జనరేషన్, సీజర్ మేనేజ్‌మెంట్ రిపోర్టు తదితర అంశాలపై సమీక్షించారు. నిఘా బృందాలను పటిష్టం చేయాలని, అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్ఒలు నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో రెండో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త ఎన్.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న బాలురకు దుప్పలవలస గురుకుల పాఠశాలలో, 19న పెద్దపాడు గురుకుల పాఠశాలలో బాలికలకు కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెరిట్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి వారి మొబైల్ నంబర్లకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు బాలురు 9440887830, 7569788629 బాలికలు 7093345619 , 9000314209 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబును కలిసి వస్తున్న గుండ దంపతులు

టిడిపిలో అనిశ్చితి

నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జీలతో మాట్లాడాలని నిర్ణయించి, వారికి కబురు పంపారు. చంద్రబాబును కలిసిన గుండ అప్పలసూర్యనారాయణ దంపతులు నియోజకవర్గంలో రెండేళ్లుగా అసమ్మతిని ప్రోత్సాహించిన తీరు, తమను రాజకీయంగా అణగదొక్కేందుకు చేసిన ప్రయత్నాలను వివరించినట్లు తెలిసింది. అన్నీ విన్న చంద్రబాబు, ఈ పర్యాయం గొండు శంకర్ గెలుపు కోసం పనిచేయాలని సూచించడంతో, అసమ్మతి నాయకునితో తామెలా చేస్తామని ప్రశ్నించినట్లు తెలిసింది. అసమ్మతి నాయకునికి కాకుండా వేరే అభ్యర్థికి టిక్కెట్ ఇస్తే పనిచేసేందుకు అంగీకారం తెలిపారు. పార్టీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ గానీ పార్టీ పదవులు గానీ, ఏదైనా కార్పొరేషన్ పదవి ఇస్తామని చంద్రబాబు చేసిన ప్రతిపాదనను వారు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. చంద్రబాబును కలిసిన తర్వాత తీవ్ర మనస్తాపానికి గురైన గుండ కుటుంబం శ్రీకాకుళానికి తిరుగు ప్రయాణమైంది. తాము పార్టీలో ఉంటామని, క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటామని వారుఒక ప్రకటన విడుదల చేశారు.

కార్యకర్తల్లో తర్జనభర్జన

క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటామన్న గుండ దంపతుల నిర్ణయంపై కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ భవిష్యత్ ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. వైసిపి నాయకులతో కంటే తాము గుండ శంకర్, అతని అనుచరులతోనే ఎక్కువ పోరాడామని, ఇప్పుడు అతనితో ఎలా పనిచేయగలమని అంటున్నారు. శంకర్ గ్రూపు కనీసం తమను కలుపుకొనే పనిచేయడం లేదని కొందరు సీనియర్ నాయకులు చెప్తున్నారు. పోనీ వైసిపిలోకి వెళ్దామంటే అక్కడ తాము జూనియర్లుగానే ఉండాల్సి ఉంటుందని, ఎన్నికల తర్వాత తమను పట్టించుకోకపోవచ్చని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమకు వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీ నిర్ణయించిన అభ్యర్థికే పనిచేస్తామని మరికొందరు చెప్తున్నారు. అధిష్టానం శంకర్‌కే టిక్కెట్ కేటాయించిన నేపథ్యంలో గెలిచినా, గెలవకపోయినా వచ్చే రోజుల్లో ఆయనే పార్టీ వ్యవహారాలను చూస్తారని, ఇప్పుడు కాదంటే తర్వాత ఆయన దగ్గరకు ఎలా వెళ్లగలమని తర్జనభర్జన పడుతున్నారు. మరికొంతమంది గుండ దంపతుల మాదిరిగానే ఎన్నికల్లో తటస్థంగా ఉండిపోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వైసిపిలోకి వెళ్లేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది.

పాతపట్నంలోనూ అదే పరిస్థితి

నియోజకవర్గంలో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు పాతపట్నం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకు చంద్రబాబు కబురు పంపినట్లు తెలిసింది. చంద్రబాబు పలాస నుంచి బయలుదేరే గంట ముందు ఫోన్ రావడంతో ఆయన వెళ్లలేకపోయినట్లు సమాచారం. కలమటతో మాట్లాడడం కుదరకపోయినా, అభ్యర్థిత్వంలో మార్పు లేదనే భావించాలి. కలమటకు ఇచ్చే అవకాశం ఉంటే ముందుగానే పిలిపించుకుని మాట్లావారని ఆయన అనుచరులు అనుకుంటున్నారు. దీంతో కలమట స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు జిల్లా పర్యటనకు రెండు రోజుల ముందు పాతపట్నంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించి తన బలాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. అయితే నామినేషన్ దాఖలు, ఆ తర్వాత ఎంతమంది ఆయన వెంట ఉంటారనేది చూడాల్సి ఉంది. ఎన్నికల్లో కలమట తరుపున పనిచేస్తే వచ్చే రోజుల్లో మామిడి గోవిందరావు దగ్గరకు ఎలా వెళ్లగలమన్న సంశయంతో ఏమీ తేల్చుకోలేకపోతున్నారు. ఇప్పటికే కొంతమంది టిడిపి నాయకులు ఒక్కొక్కరుగా మామిడి గోవిందరావు పంచన చేరుతున్నారు. అలాగని అంతా గోవిందరావు వైపే వస్తారని అనుకునే పరిస్థితి లేదు.

మొదటి పేజీ తరువాయి

దీంతో ఇక్కడ టిడిపి గెలుపు అనుకున్నంత సులువు కాదనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

14 ఏళ్ల పాలనలో ఏం చేశారు?

సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు బాబు పరిపాలనను చూశారని రాష్ట్రాన్ని ఎలా దోచుకున్నారో, ఎలా నాశనం చేశారో అందరికీ తెలుసునన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో బాబు ప్రభుత్వంలో ఫైనాన్స్ సెక్రటరీగా పనిచేసిన పి.వి రమేష్ పాత్ర ఉందనడానికి బాబు స్వహస్తాలతో రాసిన లేఖలు ఉన్నాయన్నారు. విశాఖపట్నం నుంచి భావనపాడు వరకు బీచ్ రోడ్డు నిర్మించి పరిశ్రమలు, పర్యాటక ప్రదేశాలుగా మార్చుతానని చెప్పడానికి చంద్రబాబుకు సిగ్గు అనిపించడం లేదన్నారు. తన పాలనలో ఆ పని ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే అగ్గిపెట్టె అంత స్థలం ఇచ్చారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో టిట్కో ఇళ్లు ఎంత విస్తీర్ణమని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గంలో కొండలు మింగేందుకు ప్రయత్నించిన నాయకులను తాను పక్కన పెడితే వారికి చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. రుషికొండ కోసం ప్రతిసారీ మాట్లాడుతున్న చంద్రబాబు, విశాఖపట్నంలో కొండలపై రామానాయుడు, రామోజీ కట్టిన ఫిల్మ్ సిటీ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయన ఇచ్చే హామీలు, చెప్పే మాటలు ప్రజలకు ఇప్పటికే అర్థమైందని, ఆయన ఎంత గొంతు చించుకున్నా ప్రయోజనం లేదన్నారు.

రేపట్నుంచి నామినేషన్ల ప్రక్రియ

మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వీకరిస్తారు. నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థులకు వర్తించే ప్రవర్తనా నియమావళి తప్పక పాటించాల్సి ఉంటుంది. ప్రవర్తనా నియమావళి గురించి అవగాహన లేకపోతే అభ్యర్థులకు చిక్కులు తప్పవు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం నిబంధనలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

నామినేషన్ పత్రం ఎలా ఉండాలి?

నామినేషన్ పత్రం నిర్దేశించిన తేదీలో ఉండాలి. ఎన్నికల సంఘం 1961 నియమావళి-4 ప్రకారం నామినేషన్ పత్రం రూపం నిర్దేశించింది. దీని ప్రకారం, ఫారం-2ఎ లోక్‌సభ ఎన్నికల నామినేషన్ పత్రంగా సూచించారు. ఫారం-28 శాసనసభ ఎన్నికల నామినేషన్ పత్రంగా నిర్దేశించారు. అభ్యర్థి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నుంచి పోటీలో ఉంటే, ఆ నియోజకవర్గంలోని ఓటర్లు ప్రతిపాదకునిగా నామినేషన్ పత్రంలో భాగం-1పై సంతకం చేయాల్సి ఉంటుంది. దీనికి అదనంగా, అభ్యర్థి తప్పనిసరిగా పార్ట్-3, నామినేషన్ పత్రంలో అవసరమైన డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి లేదా అతని ప్రతిపాదకుల్లో ఎవరైనా సంతకం చేయలేకపోతే బొటన వేలిముద్ర ఆర్ఓ సమక్షంలో వేయాల్సి ఉంటుంది.

ఎస్‌సి, ఎస్‌టి రిజర్వుడు నియోజకవర్గాల్లో అభ్యర్థులు తాము షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగకు చెందినవాడినని నామినేషన్ పత్రంతో తప్పక ప్రకటించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పదవిలో నుంచి తొలగించబడ్డ ఉద్యోగి పోటీ చేస్తున్నట్టయితే తన నామినేషన్ పత్రంతో పాటు, సెక్షన్ 9 ప్రకారం ఎన్నికల సంఘం జారీ చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.

ఒక నియోజకవర్గానికి అభ్యర్థి, అతని తరపున గరిష్టంగా నాలుగు నామినేషన్ పత్రాలను దాఖలు చేసుకోవచ్చు. అభ్యర్థి తాను ఓటరుగా నమోదు చేసుకున్న నియోజకవర్గం కాకుండా ఇతర నియోజకవర్గం నుండి పోటీ చేయాలనుకుంటే, అతను ఓటరుగా నమోదు చేసుకున్న ఓటర్ల జాబితా భాగాన్ని సమర్పించాలి. అభ్యర్థి తన సరైన వయసును నామినేషన్ పత్రంలో డిక్లరేషన్ చేయాల్సి ఉంటుంది. తాను పోటీ చేస్తున్న రాజకీయ పార్టీ పేరు నామినేషన్ పత్రాల్లో రాయాలి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటే, ఈ నిబంధన వర్తించదు. ఈ అభ్యర్థులకు ఎన్నికల సంఘం నోటిఫై చేసిన ఉచిత చిహ్నాల జాబితా నుంచి ప్రాధాన్యతా క్రమంలో మూడు చిహ్నాల ఎంపికకు అవకాశం ఉంటుంది.

అఫిడవిట్ ఎందుకోసం..

ప్రజాప్రాతినిధ్యంలోని 8, 1951 అభ్యర్థి దోషిగా నిర్ధారించబడినా, లేకపోయినా తన నామినేషన్ పత్రంతో పాటు అఫిడవిట్‌ను సమర్పించాలి. ఆర్టికల్ 84, 173 ప్రకారం అభ్యర్థి రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన ఫారం ప్రమాణం చేసి సభ్యత్వాన్ని పొందాల్సి ఉంటుంది, అతను రాజ్యాంగంపై నిజమైన విశ్వాసం, సమగ్రతను కలిగి ఉంటాడు. భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యతకు మద్దతు ఇస్తాడు. అటువంటి ప్రమాణం నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ఏ సందర్భంలోనైనా పరిశీలన తేదీకి ముందు చేయాల్సి ఉంటుంది. అటువంటి ప్రమాణం తప్పనిసరిగా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పరిశీలన తేదీకి ముందు రోజు సబ్‌స్క్రైబ్ చేయాలి. అభ్యర్థి తన నామినేషన్ పత్రంలో ఆయా అంశాలపై ప్రకటన చేయాలి.

డిపాజిట్ ఎంతెంత?

ఆర్‌పి చట్టం, 1951లోని సెక్షన్ 34 ప్రకారం, అభ్యర్థి చట్టం ద్వారా నిర్దేశించిన సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం, లోక్‌సభ అభ్యర్థులు రూ.25 వేలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.పది వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు లోక్‌సభకు రూ. 12,500, అసెంబ్లీ అయితే రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్‌ను రిటర్నింగ్ అధికారి వద్ద నగదు రూపంలో గానీ, రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా, ట్రెజరీ చలానా ద్వారా గానీ చెల్లించవచ్చు.

రసీదు పొందడం తప్పనిసరి

రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రం స్వీకరించిన వెంటనే దానికి సంబంధించిన రసీదుని ధ్రువీకరించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రం రసీదుతో రిటర్నింగ్ అధికారి అభ్యర్థికి నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రం పరిశీలన ఏ తేదీ, సమయం, ప్రదేశంలో జరుగుతుందో తెలియజేస్తుంది. అభ్యర్థి రసీదు రిటర్నింగ్ అధికారి నుంచి పొందడం మంచిది.

సివిల్స్‌లో వెంకటేష్‌కు 467వ ర్యాంకు

సివిల్స్‌పై మక్కువతో సాధన సాగించారు. తొలి ప్రయత్నంలో విఫలం కాగా, రెండో పర్యాయం ర్యాంకు దక్కించుకున్నారు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా సాధన సాగించానని, తుది ఫలితాల్లో ఐఎఎస్ దక్కకపోతే మరోసారి సాధన సాగిస్తానని ఆయన చెప్పారు.

వేట నిషేధం ధిక్కరణ

ప్రాంతమైన ఇచ్ఛాపురం మండలంలోని డొంకూరు, కవిటి మండలంలోని చిన్నకర్రివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, బట్టివానిపాలెం తదితర తీర ప్రాంతాల్లోని సముద్రంలో రెండు రోజులు వేట కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ వేట నిషేధ ఉత్తర్వులను తుంగలో తొక్కుతున్నారు. మత్స్య సంపద వృద్ధికి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధిస్తుంది. సంప్రదాయ తెప్పలకి మాత్రమే చేపల వేట నిషేధం నుంచి మినహాయింపు ఉంటుంది. ఒడిశా మత్స్యకారులు మాత్రం మోటారు బోట్లపై వచ్చి వేట సాగిస్తున్నారు. దీంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా మత్స్యకారుల వేట నిషేధించకపోతే తామూ వేట సాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఒడిశా మత్స్యకారులు వేట సాగించడంపై ఎఫ్ఎఒ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా, విషయాన్ని మత్స్యశాఖ డీడీకి నివేదించి వేట నిషేధానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చంద్రబాబు హామీలను నమ్మొద్దు

మందస : ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

పోలాకి : ప్రచారం చేస్తున్న కృష్ణదాస్

కవిటి : ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- మందస

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెబుతున్న బూటకపు హామీలను నమ్మొద్దని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం బసవసాయి, కొంకడాపుట్టి, బొగబంద తదితర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ వాలంటీర్ల వ్యవస్థ పెడితే ఎందుకని ప్రశ్నించిన చంద్రబాబు, టిడిపి అధికారంలోకి వచ్చాక వాలంటీర్లకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పడానికి సిగ్గుచోటని అన్నారు. పలాసలో 200 పడకలకిడ్నీ పరిశోధన కేంద్రం, రూ.700 కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను మరలా ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కారి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, పిఎసిఎస్ సూర్యారావు, చింతాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని దీర్ఘాశి, మడపాం, పోలాకి గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, వైసిపి నాయకులు ధర్మాన రామలింగం నాయుడు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ఎం.సుమంగళి, పాకోటి అప్పారావు, ఆర్.త్రినాథరావు, చింతు రాఘవ, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న పాల్గొన్నారు.

కవిటి: వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలంలోని సహలాలపుట్టుగ లో వైసిపి నాయకులతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, సర్పంచ్ లక్ష్మీప్రధాన్,ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్‌ను మళ్లీ సిఎంను చేయాలని వైసిపి అభ్యర్థి పిరియా విజయ కోరారు. మండలంలోని మండపల్లి పంచాయతీలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ పిట్ట శేషగిరి, పిట్ట మామయ్య, చిట్టిబాబు, మోహనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : 'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న విజయ

కోటబొమ్మాళి : ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలో ప్రకాశనగర్, 1,2,3 వార్డుల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, వైస్ ఎంపిపిలు దుక్క రోజా, గడ్డవలస నాగభూషణరావు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

కొత్తూరు : రెడ్డి శాంతికి మద్దతుగా ఆమె తనాయుడు ఓంశ్రీకృష్ణ కర్లెమ్మపంచాయతీ నేతాజీనగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనరాఆయణ, రమేష, ఆనందరావు, తిరుపతిరావు, బి.శ్రీను, వి.లక్ష్మీనారాయణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన పాపమ్మ

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని నీలంపేట జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం రెండు బైకులు బోల్తా పడటంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. రేగిడి ఆమదాలవలస మండలం సంకిలికి చెందిన కొయ్యాల నరసింహ నాయుడు, భరత్ కుమార్‌లు వేరువేరు బైక్‌లపై శ్రీకాకుళం నుంచి తమ స్వగ్రామమైన సంకిలి వస్తుండగా బూర్జ మండలం నీలంపేట గ్రామం వద్ద ఉన్న పెద్దపెద్ద గోతుల్లో నరసింహనాయుడు బైక్ గోతిలో దిగిపోవడంతో వెనుక కూర్చున్న వసంత పడిపోయింది. వెనుక నుంచి వస్తున్న భరత్ కుమార్ బైక్ అదే గోతిలో దిగిపోవడంతో వెనుకన కూర్చున్న పాపమ్మ పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేట్ అంబులెన్స్‌లో పాలకొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు.

జీడి తోటలు పరిశీలన

మెళియాపుట్టి : మండలంలో పరశురాంపురం, బర్నికోట తదితర గ్రామాల్లో జీడి తోటల హార్టికల్చర్ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలాస ఆర్టికల్చర్ అధికారి శంకర్‌దాస్, శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. మండలం సింగుపురం పంచాయతీ పల్లివలసలో మంగళవారం మాజీ సర్పంచ్ గుండ మోహనరావు, కంచు చిన్నారావు, సూర్యనారాయణ, సాయి, మంచి రెడ్డి రామారావు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి గొండు శంకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలక రాజకీయాలకు దూరం

శ్రీకాకుళం అర్బన్ : సుదీర్ఘ కాలం పాటు శ్రీకాకుళం నియోజకవర్గ రాజకీయాల్లో టిడిపికి నాయకత్వం వహించిన తాము పార్టీ నిర్ణయానుసారం కార్యకర్తలుగా కొనసాగుతామని, చంద్రబాబు సూచనతో ఇండిపెండెంట్ నిర్ణయాన్ని విరమించు కుంటున్నామని గుండ దంపతులు వెల్లడించారు. మంగళవారం పలాసలో చంద్రబాబును కలిసి ప్రకటన విడుదల చేశారు. నియోజక వర్గం నుంచి టిక్కెట్టు వస్తుందని, తమతో పాటు ఎదురు చూడడం, ఇన్ని రోజులు ధైర్యాన్ని అందించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. టిక్కెట్ మార్పు తమను బాధించినప్పటికీ పార్టీ అధినేత న్యాయం చేస్తామని భావించా మని, నలభైఏళ్లలో తామెప్పుడూ అసమ్మతి రాజకీయాలు, అవినీతి రాజకీయాలు చేయలేదన్నారు. రాజకీయాల్లో టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు, బిజెపి నాయ కులు వాజపాయి, అద్వానీ పార్టీలో ఉంటూ క్రియాశీలక బాధ్యతల నుంచి తప్పుకున్నారని గుర్తుచేశారు.

దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబు రాజకీయ జీవితంలో దళితుల పట్ల చిన్న చూపుతోనే ఉన్నారని, దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఎప్పటికీ దళితులు మరచిపోరని వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు పొన్నాడ రుషి ఆరోపించారు. మంగళవారం టౌన్‌హాల్లో విలేకర్లతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమశాఖ ద్వారా పేదలకోసం సేకరించిన భూమిని లీజుపేరుతో టిడిపిఐ కార్యాలయాన్ని నిర్మించుకుని రూ.కోట్ల విలువైన ఆస్తిని కాజేశారన్నారు. 99ఏళ్ల లీజు ప్రాతిపదికన తీసుకున్న ఈ స్థలాన్ని పేదలకు ఇవ్వాలన్నారు. సొంత కార్యాలయం నిర్మించుకోవడం అభివృద్ధా అని ప్రశ్నించారు. రెవిన్యూ మంత్రి ధర్మాన జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, అభివృద్ధి అంటేనే ఆయన వైపు చూడాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడం టిడిపి నాయకులకు సరికాదన్నారు. సిఎం జగన్మోహనరెడ్డి దళితుల ప్రయోజనం కోసం ఎంతో శ్రమించారన్నారు. ఈ ఎన్నికల్లో తిరిగి ఆయనకే పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్, జనరల్ సెక్రటరీ యజ్జల గురుమూర్తి, సెక్రటరీ మెరక సూర్యనారాయణ, లోపింటి చిట్టిబాబు, కొమ్ము గురువులు, నల్లబారికి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రుషి

చంద్రబాబును కలిసిన శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అత్యధిక మెజారిటీతో విజయం సాధించి అసెంబ్లీకి రావాలని టిడిపి అధినేత చంద్రబాబు శ్రీకాకుళం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌కు సూచించారు. ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలో పలాస వచ్చిన చంద్రబాబును గొండు శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన శంకర్‌కు అభినందనలు తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులను కలుపుకుంటూ ముందుకు వెళ్లి అత్యధిక మెజారిటీతో విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

చంద్రబాబుతో శంకర్

విద్యుత్ సమస్య తీరేదెప్పుడో..?

డి.మత్స్యలేశంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

గడిచిన ఐదేళ్ల నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్నా ఆ స్థాయిలో ప్రజలకు విద్యుత్ సరఫరా ఉండటం లేదు. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం, లో ఓల్టేజీ తదితర సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై ఫిర్యాదులు అందించిన మరుక్షణంలోనే పరిష్కారం చేస్తామని అధికారులు చెబుతున్నా ఆ మాటలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.ఎచ్చెర్ల మండలం డీ మత్స్యలేశంలో శ్రీలంక అమ్మవారి గుడి వీధిలో సుమారు 200 కుటుంబాలున్నాయి. ఈ వీధిలో రాత్రి 6 గంటలు దాటితే అంధకారంగా మారుతుంది. ఈ వీధిలో ప్రజలు నిత్యం చీకటి గృహంలో ఉన్నట్టు వాపోతున్నారు. ఓల్టేజీతో అన్ని ఇళ్లల్లో బల్బులు వెలగక, ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావటంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతామని ప్రజలు వాపోతున్నారు. విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో రాత్రి సమయంలో చదువుకునేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని విద్యార్థులు తెలిపారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్యలతో రాబోయే కాలంలో తాగునీటి కష్టాలు తప్పవని మహిళలు వాపోతున్నారు. సమస్యను మూడు నెలల నుంచి అధికారులకు తెలియజేస్తున్నా కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు దాటితే చిమ్మ చీకటే

రాత్రి ఆరు దాటితే ఇంటికి వచ్చేసరికి ఇబ్బందికరంగా ఉంది. పగలంతా కష్టపడి కూలి చేసుకొని వచ్చిన తమకు కరెంటు లేక, లో ఓల్టేజీతో ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యంగా తాగునీటికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలి.

– కొమర రాములమ్మ, డి.మత్స్యలేశం

పరీక్షల సమయంలో ఇబ్బందులు పడ్డాం

తాను డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా వీధంతా రాత్రి ఆరుదాటితే ఓల్టేజితో విద్యుత్ ఇబ్బందులు పడుతున్నాం. వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు చొరవ తీసుకొని తమ గ్రామానికి లో ఓల్టేజీ సమస్య పరిష్కారం చేయాలి.

- మైలపల్లి నాగేష్, విద్యార్థి

ఎవరికి వారే యమునా తీరే

అధికార పార్టీలో నాలుగు గ్రూపులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లా రాజకీయాల్లో ఆమదాలవలసకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు నాటి నుంచి నేటి వరకు ఉంది. గతంలో బొడ్డేపల్లి రాజగోపాలరావు పార్లమెంట్ సభ్యునిగా ఉన్న సమయంలో జిల్లా రాజకీయం మొత్తం ఆమదాలవలస నుంచే కొనసాగేది. పలు రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్ష పదవులు నియోజకవర్గానికి చెందిన నాయకులే అధికంగా చేపట్టిన దాఖలాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాంకు వైసిపిలోనే గ్రూపుల గోల కంటిమీద కునుకు లేకుండా చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. నియోజవర్గంలో గ్రామీణ స్థాయిలో వైసిపి వర్గాలు ఎలా ఉన్నా... నియోజకవర్గంలో ప్రస్తుతం నాలుగు గ్రూపులుగా వైసిపి నాయకులు చీలిపోయి ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలను చేపడుతూ హవా కొనసాగిస్తున్నారు. తమ్మినేని సీతారాం, సువ్వారి గాంధీ, చింతాడ రవికుమార్, కోట గోవిందరావు వంటి నాయకులు ఎవరికి వారు కార్యక్రమాలు, ప్రచారాలు చేపడుతుండడంతో అటు వైసిపి కార్యకర్తల్లోనూ ఇటు ప్రజల్లోనూ గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. వారి వారి ప్రాబల్యాలను పెంపొందించుకునేందుకు ఎవరికి వారే విస్తృతంగా పర్యటిస్తూ ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటూ ముందుకు సాగారు. వైసిపి అధిష్టానం ఆమదాలవలస నియోజకవర్గానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకే మళ్లీ శాసనసభ అభ్యర్థిగా ప్రకటించడంతో పొందూరు మండలానికి చెందిన సువ్వాడ గాంధీ, ఆయన మరదలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవికి, ఆయన భార్య పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, అలాగే ఎంపిటిసి మాజీ సభ్యులు, సర్పంచ్‌లు ఆయన గ్రూపునకు చెందిన పలువురు వైసిపికి రాజీనామా చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా గాంధీ బరిలోకి దిగినట్లు ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి గాంధీ ప్రచారం చేసుకుంటున్నారు.

బొడ్డేపల్లి X తమ్మినేని

నియోజకవర్గంలో కొంతకాలం క్రితం వరకు బొడ్డేపల్లి, తమ్మినేని కుటుంబాల మధ్య పోటీ ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత తమ్మినేని, కూన కుటుంబాల మధ్య పోటీ ఏర్పడింది. ఎవరు గెలిచినా ఒకే కుటుంబానికి చెందిన వారనిఈ పదేళ్లలో ప్రజల్లో ఒక అసంతృప్తి ఉన్న మాట వాస్తవం. దాంతో చాలా మంది వైసిపి తరపున సీతారాంను తప్పించి కొత్త వ్యక్తికి జగన్మోహన్‌రెడ్డి సీటు ఇస్తారని అందరూ భావించారు. వైసిపి అధిష్టానం చివరికి తమ్మినేనికే జైకొట్టడంతో చాలామంది వైసిపి కార్యకర్తలు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్లు దాఖలై పోలింగ్ నాటికి ఇంకెన్ని మలుపులు తిరుగుతాయో? వేచి చూడాల్సిందే.

ఆ నలుగురు

తోట తులసీదాసునాయుడు

కలమట మోహనరావు

మినతి గొమాంగో

కలమట వెంకటరమణ

ప్రజాశక్తి- కొత్తూరు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కొత్తూరు మండలం నుంచి నలుగురు ఎన్నికయ్యారు. మండలంలోని మాతలకు చెందిన కలమాట మోహనరావు 1978లో పాతపట్నం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1989, 1994,1999, 2004 టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మాతలకు చెందిన కలమట వెంకటరమణ 2014లో వైసిపి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. పారాపురానికి చెందిన తోట తులసీదాసునాయుడు 1983లో శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుంచి టిడిపి తరుపున పోటీలు గెలుపొంది ప్రాతినిధ్యం వహించారు. మండలంలోని కర్లెమ్మ నేతాజీ నగర్‌కు చెందిన మినతి గోమాంగ్ కొత్తూరు నియోజకవర్గం నుంచి 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కలమట మోహనరావు తప్ప మిగతా ముగ్గురూ ఒక్కసారే ఎమ్మెల్యేగా గెలుపొందారు.

సర్పంచ్ నుంచి ఎంపీ అభ్యర్థి వరకు...

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పేరాడ తిలక్
వైసిపి ఎంపీ అభ్యర్థి

సిక్కోలు రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు పేరాడ తిలక్. గ్రామస్థాయి నుంచి ఎంపీ అభ్యర్థి స్థాయి వరకు ఎదిగిన వ్యక్తి. 2014లో జెడ్‌పి చైర్మన్ అభ్యర్థిగా, 2019లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా, 2024లో వైసిపి ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం వద్ద గొప్ప మార్కులు కొట్టిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. అయితే 2015లో వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినప్పటి నుంచీ ఇప్పటి వరకు ప్రజల మధ్యనే ఉంటూ మన్నవులు పొందుతున్నారు. సరికొత్త ఆలోచనలతో ఇంతింతై.. వటుడింతై అన్న చందాన ఒక్కో మెట్టూ ఎక్కారు. రాజకీయ గురువు ధర్మాన ప్రసాదరావు చాణక్యం ఒంటపట్టించుకున్నారు. వాస్తవానికి 2014లోనే ఆయన భార్య జెడ్‌పి చైర్‌పర్సన్ అభ్యర్థిగా వైసిపి ప్రకటించింది. కానీ, ఆ ఎన్నికల్లో వైసిపి ఓటమిపాలైంది. తదనంతం జగన్ 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు చేతిలో ఓటమిపాలయ్యారు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో ఎంపీగా అభ్యర్థిగా ప్రకటించారు. వాస్తవానికి తిలక్‌కు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గాల్లో గట్టిపట్టు ఉంది. బంధుగణం, సామాజిక తరగతి పెద్ద ఎత్తున ఉంది. వీరంతా తిలక్ అభ్యర్థిత్వాన్ని కోరుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇక శ్రీకాకుళం, నరసన్నపేటల్లో ఆయన గురువులే ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు మంచి సుపరిచితుడు. పాతపట్నంలో రెడ్డి శాంతికి పార్టీయే పరమావధి కనుక తిలక్‌కు అక్కడ అడ్డే లేదని పార్టీ నాయకులు భావిస్తున్నారు. అక్కడక్కడా ఎమ్మెల్యే అభ్యర్థులపై ఉన్న అసంతృప్తిని చల్లబరుచుకుంటే.. గట్టెక్కి మంచి మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కేడర్‌ని సమీకరిస్తున్న కృపారాణి

టెక్కలి: కేంద్ర మాజీ సహాయ మంత్రి, టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కిల్లి కృపారాణి పార్టీ కేడర్‌ని సమాయత్తం చేస్తున్నారు. వైసిపి పార్టీలోని తన మద్దతుదారులతో చర్చలు, సంప్రదింపులు చేపడుతున్నారు. వీరితో పాటు వైసిపి పార్టీలో ఉంటూనే ఆసంతృప్తితో ఉన్న నాయకులను, కార్యకర్తలను వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటింగ్ పెంచేందుకు, వైసిపి ఆభ్యర్థుల ఓటమికి కావాల్సిన ప్రణాళికను రచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పార్టీ కేడర్‌ని కలిసినా... కొందరు మాత్రం కృపారాణి ఆభ్యర్థిత్వాన్ని సమర్థించకపోవడంతో వారిని బుజ్జగించే యత్నాల్లో ఉన్నట్లు సమాచారం. టెక్కలి నియోజకవర్గ టిక్కెట్‌ని ఆశించి భగపడ్డ కోత మధుసూదనరావుని కలిసేందుకు మొదట్లో కృపారాణి యత్నించారు. ఆయన ఆందుబాటులో లేకపోవడం మధు పార్టీ నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ వాదులనూ కలిసి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని కోరుతున్నారు. ఇండియా ఫోరంలో భాగంగా సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావుతో కృపారాణి భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు వ్యూహం తయారు చేసుకున్నారు. అయితే టిక్కెట్ ప్రకటించి వారం రోజులు కావస్తున్నా... కృపారాణి మాత్రం ఇప్పటి వరకు ప్రచారంలోకి దిగలేదు. ఇప్పటివరకు కేడర్ సమాయత్తం చేసుకునే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆభ్యర్థిగా కృపారాణి తనవంతుగా చర్యలు చేపడుతున్నారు.

ఎవరు గెలిచినా ఒక్కసారే

ప్రజాశక్తి- టెక్కలి



టెక్కలి నియోజకవర్గానికి రాజకీయంగా ఒక ప్రత్యేకత ఉంది. ఈ నియోజకవర్గం నుంచి ఎవ్వరు విజయం సాధించినా ఒక్కసారి పదవులకే పరిమితం కావడం గమనార్హం. రెండోసారి విజయం సాధించినా పార్టీ మారడం మరో విశేషం. అయితే నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో రెండుసార్లు మాత్రం ప్రస్తుత ఎమ్మెల్యే కింజరాపు ఆచ్చెన్నాయుడు విజయం సాధించి రికార్డుని మార్చారు. శాసనసభ ఆవిర్భావం నుంచి పరిశీలిస్తే టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటికీ పదిహేడు మంది నాయకులు టెక్కలిని పరిపాలించారు. గమనించదగ్గ విషయం మరొకటి ఏమిటంటే టిడిపికి చెందిన వారే ఎక్కువగా విజయం సాధించడం. శాసనసభ ఏర్పాటు నుంచి పరిశీలిస్తే 1952లో రొక్కం లక్ష్మీనారాయణదొర ఇండిపెండెంట్‌గా గెలిచారు. మరలా 1955లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 1962లో రోణంకి సత్యనారాయణ స్వతంత్ర పార్టీ ఆభ్యర్థిగా విజయం సాధించారు. 1967లో నెచ్చెర్ల రాములు స్వతంత్ర పార్టీ ఆభ్యర్థిగా, 1972లో కాంగ్రెస్ పార్టీ నుంచి సత్తారు లోకనాథం నాయుడు, 1978లో జనతా పార్టీ నుంచి బమ్మిడి నారాయణస్వామి, 1983లో టిడిపి నుంచి అట్టాడ జనార్ధనరావు, 1985లో టిడిపి నుంచి వరదాసరోజ, 1989లో టిడిపి నుంచి దువ్వాడ నాగావళి, 1994లో టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు, 1994 ఉప ఎన్నికల్లో టిడిపి నుంచి హనుమంతు ఆప్పయ్యదొర, 1999లో టిడిపి నుంచి డాక్టర్ కొర్ల రేవతీపతి, 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి హనుమంతు ఆప్పయ్యదొర, 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ కొర్ల రేవతీపతి, 2009 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కొర్ల భారతిలు విజయం సాధించారు. 2014లో తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు అచ్చెనాయుడు, 2019లో టిడిపి నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయం సాధించారు. పదిహేడు మంది నాయకుల్లో ఎనిమిదిసార్లు టిడిపికి చెందిన వారే విజయం సాధించారు.

ఎంసిసి టీమ్‌కు వాహనాలు నిలిపివేత

ప్రజాశక్తి- పలాస



పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఎంసిసి టీమ్‌కు వాహనాలు నిలిపివేశారు. మూడు రోజులుగా వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 27 రోజులు పాటు ఇచ్చిన వాహనాలను ఎందుకు నిలిపి వేశారో అర్థం కావడంలేదు. జిల్లాలో 30 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో నాలుగు మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్లను ఎంసిసి టీమ్ అధికారిగా నియమించారు. మరో 27 మంది ఎంపిడిఒలను ఆయా మండలాల ఎంసిసి టీమ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. అయితే పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి, బూర్జ, జలుమూరు, ఆమదాలవలస, సంతబొమ్మాళి మండలాల్లో ఇతర మండలాల ఎంపిడిఒ కార్యాలయంలో పనిచేస్తున్న ఎఒలు, పంచాయతీ విస్తరణాధికారులను ఎంసిసి టీమ్ అధికారిగా జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. ఎంసిసి టీమ్‌లు మార్చి 16 నుంచి విధుల్లో చేరగా, వారికి మండలంలో పర్యటించేందుకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఒక్కొక్క మండలానికి వాహనాన్ని కేటాయించారు. మార్చి 16 నుంచి కేటాయించిన వాహనాలను ఒక్కసారిగా ఏప్రిల్ 13 నుంచి ఏడు మండలాల ఎంసిసి టీమ్‌లకు వాహనాలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో మండలంలో పర్యటించేందుకు అధికారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఎంసిసి టీమ్‌లు గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా ప్రచారాలు, ఇంటింటి ప్రచారం, రాజకీయ పార్టీల జెండాలు, స్టిక్కర్లు ఎక్కడ ఉన్న తొలగించడం, పార్టీల ప్రచారంలో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ప్రభుత్వ అధికారులు ఎవరైనా పాల్గొన్న, సి విజన్‌లో ఎవరైనా పిర్యాదు చేసిన వంద నిమిషాల్లో పరిష్కారం చేయాలి. ఇలా అన్ని పనులు చేసేందుకు టీమ్ అధికారికి వాహనం లేకపోతే పనులు ఏలా చేస్తామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపిడిఒలు, కమిషనర్లకు నిరంతర ప్రభుత్వ విధుల్లో భాగంగా వాహనాలు కేటాయించడం వల్ల ఎంసిసి టీమ్ అధికారులుగా వారిని నియమించడంతో జిల్లా అధికారులు వారికి కేటాయించిన వాహనాలను నిలిపి వేసినట్లు తెలుస్తోంది. అయితే అందులో ఏడు మండలాల్లో మండల పరిషత్ ఎఒలు, పంచాయితీ విస్తరణాధికారులకు నియమించడంతో వారికి ప్రభుత్వ వాహనాలు లేకపోగా ఎన్నికల అధికారులు కేటాయించిన వాహనాలు సైతం నిలిపి వేయడంతో ఎంసిసి టీమ్ అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా వాహనాలు లేని ఎంసిసి టీమ్ అధికారులకు తక్షణమే వాహనాలు కేటాయించాలని ఆయా మండలాల ఎంసిసి టీమ్ అధికారులు కోరుతున్నారు.

ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త



ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎన్నికల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం విధులపై అలసత్వం వహించినా, రాజకీయ నేతల ప్రచారంలో పాల్గొన్నా ఉద్యోగం ఊడే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సారి ఎన్నికల సంఘం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. పాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. ఉద్యోగులేవరూ అభ్యర్థులతో కలిసి ప్రచారం చేయరాదు. ఏ రాజకీయ పక్షానికి అనుకూలంగా మాట్లాడినా, వ్యవహరించినా చర్యలు తీసుకుంటారు. అంతేకాదు సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో వారికి అనుకూలంగా ప్రచారం కల్పించినా, వ్యాఖ్యలు చేసినా చర్యలు తప్పవు. ప్రభుత్వ పథకాలపై వ్యతిరేకంగానో, అనుకూలంగానో ప్రచారం చేయరాదు. పార్టీలు ఏర్పాటు చేసే సభలకు, సమావేశాలకు వెళ్లకూడదు. ఉద్యోగులపై ఎవరికైనా అనుమానం కలిగినా, మీ ప్రాంతాల్లో ఎవరైనా వీడియో, ఆడియో తీసి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తే ఉద్యోగంపై వేటు తప్పదని నిబంధనాలు చెబుతున్నాయి.

ఉల్లంఘనులూ జాగ్రత్త..!

జిల్లాలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ను అధికారులు పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బందాలను నియమించి వాహన తనిఖీలు చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలపై ప్రత్యేక దృష్టిసారించారు. బ్యాంకుల లావాదేవీలపై ఓ కన్నేసి ఉంచుతున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి కింద ఎవరెవరు ఏం చేయవచ్చు? ఏం చేయకూడదు? ప్రజలు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే తెలుసుకుందాం రండి.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం

ప్రచారాల్లో ఇవి తగదు...

- మతపరమైన ప్రార్థనా మందిరాల్లో, కులం, మతం, ప్రాంతం, వర్గ, జాతి బేధాలు వంటి సున్నితమైన అంశాలతో ప్రచారం చేయరాదు.
- ప్రజా జీవితానికి ఇబ్బంది కలిగేలా ఊరేగింపుతో వెళ్లరాదు.
- అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే ప్రచారం చేయాలి. ఇందులో అయిదుగురు కంటే ఎక్కువ మంది ప్రయాణించకూడదు.
- ప్రభుత్వ కార్యాలయాల్లో, అనుమతి లేకుండా ప్రభుత్వ మైదానాల్లో ప్రచారం చేయరాదు.
- ప్రయివేటు స్థలాల్లో ప్రచారం చేసేందుకు ఇంటి, స్థల యజమాని, ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాలి.
- ప్రచారంలో మద్యం పంపిణీ నిషేధం.
- ప్రజల మధ్య శత్రుత్వం పెరిగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదు.

చేయకూడనవి...

- సభలు, సమావేశాలు, ప్రదర్శనలకు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి
- రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదు.
- పోలింగ్ రోజున ఓటర్ల రవాణాకు ఎలాంటి వాహనాలు ఉపయోగించకూడదు.
- ఎన్నికల ఫలితాలపై సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ నిషేధం.
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకూడదు.
- పోలింగ్ కేంద్రాల్లోకి అక్రమంగా ప్రవేశించడం, ఇవిఎం, ఇతర దస్త్రాలను తొలగించడం నేరం.
- రహస్య ఓటింగ్ పద్ధతికి, ఇతరుల సభలు, సమావేశాలకు భంగం ప్రదర్శనలతో ట్రాఫిక్ అంతరాయం కలిగించకూడదు.
- తప్పుడు ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌కు అనుమతి లేదు.
- తాత్కాలిక, శాశ్వత ఉద్యోగ నియామకాలు చేయరాదు.
- కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు అధికారులను సమీక్షలు, సమావేశాలకు పిలవకూడదు.
- పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారాలు ఆపేయాలి.
- నామినేషన్లు వేసేటప్పుడు 3 వాహనాల్లో మాత్రమే రావాలి. కేవలం అయిదుగురిని మాత్రమే ఆర్ఒ కార్యాలయంలోకి అనుమతిస్తారు.

చేసుకోదగినవి..

- న్యాయస్థానం ఆదేశాలు ఉన్న ఉద్యోగ నియామకాలు ప్రక్రియ పూర్తి చేయవచ్చు.
- కరువు నివారణ పనులు చేపట్టవచ్చు.
- కరువు ప్రాంతాలకు ఆహారం సరఫరా చేయవచ్చు.
- ఎన్నికల సంఘం అనుమతితో తాగునీటి సరఫరా, ఖైదీల విడుదల, గిట్టుబాటు ధరల నిర్ణయం వంటివి చేయవచ్చు.
- అభ్యర్థి ప్రచారానికి టోపీలు, మాస్కులు వగైరా ఇవ్వొచ్చు.
- ప్రత్యర్థి పార్టీ నిధి, వాహనాలను విమర్శించుకోవచ్చు.

తనిఖీలకు అడ్డు చెప్పకూడదు

రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతితో ఊరేగింపులు, ర్యాలీలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారు. వాహనాలను ఆపి పూర్తిగా పరిశీలిస్తారు. దీనికి అభ్యంతరం పెట్టే అధికారం ఎవరికీ లేదు. వాహనాల్లో నిషేధిత వస్తువులు ఉంటే స్వాధీనం చేసుకుంటారు. పరిమితికి మించి లెక్కలు, ఆధారాలు చూపలని డబ్బులు, మద్యం ఉంటే వాహనంతో సహా సీజ్ చేస్తారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.



'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లేశ్వరరావు

ఒక్కసారి అవకాశం ఇవ్వాలి

లావేరు: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎచ్చెర్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని గురుగుబిల్లి పెద్దలింగాలవలసలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి హస్తం గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబోతుల వెంకట నాయుడు, దొండపాటి అప్పారావు, నడిమింటి సత్యనారాయణ, మీసాల లక్ష్మణపాల్గొన్నారు.

రవికుమార్ ఇంటింటా ప్రచారం

పొందూరు: మండల కేంద్రంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ మంగళవారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, ఎంపిటిసిలు బాడాన హారిక, అనకాపల్లి వాణి, టిడిపి పట్టణ అధ్యక్షులు అనకాపల్లి చిన్న రంగ, జనసేన మండల అధ్యక్షులు ఎలకల రమణ, సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నం నాయుడు, టిడిపి నాయకులు కూన వెంకట సత్యనారాయణ, బలగ శంకర్ భాస్కరరావు, రాము, గిరి, నారాయణరావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రవికుమార్

కాంగ్రెస్‌తోనే పేదలకు భవిష్యత్

ప్రజాశక్తి- ఆమదాలవలస

'ఉపాధి' కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న అన్నాజీరావు

కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజల భవిష్యత్ ముడిపడి ఉందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. మంగళవారం మండలం కొర్లకోట గ్రామ శివారున ఉన్న శ్యామలాంబ చెరువు వద్ద ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టిందని, ప్రజలు వేసవికాలంలో వలసలు పోతున్నారని గమనించి ఆ వలసలను అరికట్టడానికి ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి గ్రామాల్లోనే రైతులకు ఉపాధి కల్పించిందన్నారు. బడుగు బలహీన వర్గాల కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దోచుకున్నారు

ప్రచారం చేస్తున్న గాంధీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీలో ప్రజలకు అందించాల్సిన సేవలు నిల్ అని కలెక్షన్స్ మాత్రం ఫుల్ అని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో పట్టణ శివారున ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుంచి కృష్ణాపురం జంక్షన్ వరకు ఇంటింటా ప్రచారం చేపట్టారు. పలుచోట్ల మామ, అల్లుళ్ల చీకటి ఒప్పందాలపై వ్యాపారులకు, ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరుకే మున్సిపాలిటీ అని ప్రజలకు సేవలు అందించడంలో పంచాయతీ కంటే అధ్వాన్నమన్నారు. గడచిన పది సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలో అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరిగిందన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ ప్రజలు వారి కుయుక్తులను గమనించి రానున్న ఎన్నికల్లో తనను బలపరచాలని కోరారు. కార్యక్రమంలో పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, అన్నెపు సూరిబాబు, సువ్వారి అనిల్ కుమార్, వైకుంఠరావు, సువ్వారి సత్యనారాయణ (ఢిల్లీ), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపికి ఇవే చివరి ఎన్నికలు

ప్రజాశక్తి- ఆమదాలవలస, పొందూరు

పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలో డాబాల వారి వీధి, కుసుమంచి వారి వీధి, మార్కెట్ వీధిలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, అర్హత గల ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. టిడిపికి ఇవే చివరి ఎన్నికలని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. 2014 ఎన్నికల్లో 612 హామీలు ఇచ్చి అమలు చేయలేదని స్పీకర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లంశెట్టి ఉమా మహేశ్వరరావు, శిల్లా మల్లికార్జునరావు, కుసుమంచి శ్యాంప్రసాద్, శ్యామలరావు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమానికి పెద్దపెట్టవేసిన వైసిపి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టను న్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు మండలం బొడ్డేపల్లిలో వైసిపి అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్ కుమార్, సర్పంచ్ బొడ్డేపల్లి శ్రీవల్లి, పిఎసిఎస్ ఛైర్మన్ కొంచాడ రమణమూర్తి, వైసిపి నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, సూరపనాయుడు, గుడ్ల మోహన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రచారం చేస్తున్న సీతారాం

అవార్డును అందుకుంటున్న హారిక

లయన్స్ క్లబ్ హర్షవల్లికి అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

2023-2024కు సంబంధించి మెంబర్ షిప్ గ్రూప్ ఎక్స్‌లెన్సీ అవార్డును 316 అంతర్జాతీయ లైన్సు అవార్డ్‌ను లైన్స్‌క్లబ్ హర్షవల్లి అధ్యక్షురాలు కరణం శోభారాణికి లభించింది. మూడురోజుల పాటు విశాఖపట్నంలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ సదస్సులో ఈ అవార్డును ఆమె తరపున డాక్టర్ కరణం హారిక స్వీకరించారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పావని

వడదెబ్బకు గురికావద్దు

ప్రజాశక్తి- బూర్జ

వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు వడదెబ్బకు గురికావద్దని, అందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారిణి పావని తెలిపారు. మంగళవారం మండలంలోని అల్లెనలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 361 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజిని, సిహెచ్‌ఒ అప్పలస్వామి, ఎంఎల్‌హెచ్‌పిఒ ప్రవళిక, రాధిక, అలేఖ్యతో పాటు ఎఎన్ఎం మాలతి, ఆశా వర్కర్లు, గ్రామపెద్దలు జడ్డు మహేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా వీరేశలింగం పంతులు జయంతి

ప్రజాశక్తి- లావేరు

తెలుగు నాటక రంగ దినోత్సవం, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన టి.సంధ్యకు గ్రంథాలయం తరపున బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ బి.నీలిమ, ప్రిన్సిపాల్ టి.బాలరాజు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేక జగన్‌పై దాడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల జగన్ పాలనతో ప్రజలకు మరింత దగ్గరయ్యారని, అందువల్లే ఆయన్ను ఎదుర్కొనే శక్తి లేక ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఆయన వేగాన్ని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు కుట్ర చేసి రాళ్ల దాడికి పాల్పడ్డారని వైసిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఎస్.వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి దాడులకు భయపడకుండా ప్రజలు ఓటుతో సరైన సమాధానం చెప్పాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారులు విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక శ్రీప్రియ ఉషోదయ స్కూల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థలో అగ్ని ప్రమాదాలు జరిగి నప్పుడు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి పైల అశోక్ మాట్లాడుతూ విద్యాసంస్థలో చదువుకుంటున్న, వసతి గృహంలో ఉన్నవారు ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వారు ప్రాణాలతో ఎలా బయటపడాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కొల్లి పోలినాయుడు, ఎ.రాము, సిహెచ్ నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణ శివారులో ఉన్న శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి చక్రధరరావు అవగాహన కల్పించారు. లైఫ్ జాకెట్ల వినియోగం, అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీవాణి విద్యానికేతన్ డైరెక్టర్ బి. వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ బి.నారాయణమూర్తి, హెచ్ఎం బి.సంపత్ కుమార్, ఉపాధ్యాయులు జె.సూర్యనారాయణ, శ్రీరాములు, జి.హరిబాబు, బి.ప్రణవి, బి.అప్పల నాయుడు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలాస : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

పలాస : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సూదికొండ కాలనీలో నివాసం ఉంటున్న మహిళలకు అగ్నిప్రమాదాలపై అధికారులు అవగాహన కల్పించారు. వంట గదిలో గ్యాస్ పొయ్యల ద్వారా అగ్నిప్రమాదాలు జరిగితే ఎలాటి నివారణ చర్యలు చేపట్టాలనే దానిపై డెమో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్తా బి.సోమేశ్వరరావు, ఎల్ఎఫ్మ కె.యుగంధర్, పి.శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, వి.రాము, రవిశంకర్, చిరంజీవి, గోపాల్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థాకి హోలీక్రాస్ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక అధికారి బుచ్చోడు ఆధ్వర్యాన అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

టిడిపి ఇంటింటా విస్తృత ప్రచారం

కవిటి: 'మీ బిడ్డగా గత పదేళ్లుగా మీ కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నానని, ఇప్పటి వరకూ తనపై చూపించిన అభిమానాన్ని కొనసాగిస్తూ మరోసారి ఆదరించాలని' ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఓటర్లని కోరారు. జనసేన నాయకులు లోల్ల రాజేష్, దాసరి రాజు, బిజెపి కన్వీనర్ నిర్మల రెడ్డితో కలిసి కవిటిలో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ... సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల పాల్గొన్నారు.

టెక్కలి : ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుని గెలిపించాలని కోరుతూ టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి పట్టణంలోని అక్కపువీధి, తెలుగు బ్రాహ్మణవీధి, తెలుకల వీధుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు లవకుమార్ హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, రెయ్యి ప్రీతీష్‌చంద్ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని కైజాల, కందులగూడెం, బర్తపురం గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుకు మద్దతుగా నాయకులు అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖరరావు, నందిగాం తిరుపతిరావు, సలాన కృష్ణారావు, ముదిలి సింహాచలం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

కవిటి : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

సంతబొమ్మాళి : ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

పోలాకి : మండలంలోని తోటాడ, సారవకోట మండలం కొమ్ముసారియపల్లి, పెద్దగుజ్జువాడ, వాంద్రాయి, రంగాపురంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ బలగ ప్రవీణ్‌కుమార్, ధర్మాన తేజ్‌కుమార్, ఎం.వి. నాయుడు, పంచిరెడ్డి సింహాచలం, మండల పార్టీ అ ధ్యక్షులు వెంకట రమణ, చిన్ని కృష్ణంనాయుడు, భీమారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ 11వ వార్డులో టిడిపి, జనసేన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడుకు మద్దతుగా రోకల్ల భాస్కర్, దాసరి శేఖర్, కలియ గౌడో, దుర్గాసి నీలవేణి, రుకమంగాధర్, అశోక్, బుద్దాల నిర్మల రామ్మూర్తి, విశ్వనాథం, కృష్ణవేణి, హేమ ప్రచారం నిర్వహించారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం నర్సాపురం పంచాయతీ చరణదాసుపురం, యర్నాగులపేట గ్రామాల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎంపీ, ఎంఎల్‌ఎగా గెలిపించాలని కోరారు. కార్ర్యమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి మోడీ చంద్రరావు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో ఆధార్ నవీకరణ, నూతన ఆధార్ నమోదు ప్రక్రియ సేవలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించడం జరిగిందని, ఈ సేవలను వినియోగదారులు ఉపయోగించుకోవాలని హెడ్ పోస్ట్ మాస్టర్ జి.ఉమా శంకర్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పోస్ట్ ఆఫీస్‌లో అయోధ్య రామ మందిరంపై విడుదల కాబడిన ఫిలాటెలీ సావనీర్ వెల రూ.500 అని అవి అమ్మకానికి కలవని ప్రజల ందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అధిక వడ్డీ, అధిక భద్రత అందించే పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ పథకాలైన ఎస్‌బి, ఆర్‌డి, టిడి, కెవిపి, ఎన్ఎస్‌సి, ఎంఐఎస్, ఎస్‌సిఎస్ఎస్ వంటి పథకాల్లో పెట్టుబడి పెట్టాలని కోరారు.

నగదును అందజేస్తున్న డేవిడ్

యశోదమ్మ సేవా సమితి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్య నేర్పిన గురువు కష్టంలో ఉన్నారని తెలుసుకుని యశోదమ్మ సేవాసమితి సభ్యులు ఆయనకు ఆర్థికంగా సాయపడుతూ అండగా నిలిచారు. నగరంలోని చైతన్య సహకార కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పని చేసిన రమేష్ కుమార్ కేన్సర్ వ్యాధితో కొన్నేళ్లుగా పోరాడుతున్నారు. ఈయనకు ప్రస్తుతం వైద్య పరీక్షలు చేయించు కోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన ఆయన ప్రస్తుతం అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న మాదారపు డేవిడ్ తన తల్లి పేరుమీద నెలకొల్పిన యశోదమ్మ సేవాసమితి తరపున రూ.11 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి సాయాన్ని అందజేశారు. ఆయనను ఆదుకునేందుకు తోటి విద్యార్థులు, మనసున్న వారు అండగా నిలవాలని డేవిడ్ కోరారు. సాయం చేయదలచిన వారు 9553510429 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తెలగలను బిసిల్లో చేర్చాలి

పలాస: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా విద్య, ఉపాధిలో వెనకబడిన తెలగలను బిసి జాబితాలో చేర్చాలని తెలగ రిజర్వేషన్ ఉద్యమ నేత పల్లంట్ల వెంకట రామారావు కోరారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం రాత్రి చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిసి తెలగల సమస్యలపై వినతిపత్రంఅ ందజేశారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయనతో పాటు తెలగ నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, ఎం.సురేష్, అల్లాడ శ్రీనివాసరావు, గట్టి రఘు, పాసుపు శ్రీని వాసరావు, చిన్ని, వెంకటేష్, గోపి, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యను చంద్రబాబుకు వివరిస్తున్న రామారావు

చంద్రబాబు సమక్షంలో చేరిన పద్మజీ

టిడిపిలో చేరిన పద్మజీ

పలాస: పలాస టిడిపి కార్యాలయంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ కామేశ్వరరావు వైసిపి నుంచి టిడిపిలో మంగళవారం చేరారు. ఆమెకు చంద్రబాబు నాయుడు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌతు శిరీష గెలుపుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిన్ని

చంద్రబాబును కలిసిన చిన్ని

కోటబొమ్మాళి: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును మంగళవారం పలాసలో మాజీ మంత్రి గౌతు శివాజీ స్వగృహంలో కోటబొమ్మాళి టిడిపి నాయకులు నాళ్ల ఆదినారాయణ (చిన్ని) మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, తెలగకుల ఉద్యమ నాయకులు పివిఆర్ పాల్గొన్నారు.

మజ్జిగను అందిస్తున్న రాజేష్

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

మండల కేంద్రంలోని స్థానిక కళ్యాణి పాఠశాల ఆధ్వర్యాన మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. లోల్ల నారాయణమూర్తి 8వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం తమ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేందుకు వచ్చే వందలాది మందికి ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం పలువురికి చల్లని మజ్జిక అందించారు. కార్యక్రమంలో కళ్యాణి పాఠశాల ఎఒ మాదినరాణి, ప్రిన్సిపాళ్లు బిందుమాధవి, శంకరరావు, సిబ్బంది ఉమాపతి, చిన్ని, రాము పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వైసిపికి గుడ్ బై

నౌపడ : సంతబొమ్మాళి మండలం హనుమంతు నాయుడుపేట పంచాయతీ మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కరరావు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో మంగళవారం వైసిపికి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం టిడిపి కార్యాలయంలో టిడిపి కండువాలు కప్పుకున్నారు. ఆయనతో పాటు కోళ్ల బైరాగి, పాలకొండ నారాయణ తదితరులు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జీరు భీమారావు, కర్రి విష్ణుమూర్తి, అట్టాడ రాంప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఉద్దాన ప్రాంతంలో జీడి పంటపై రైతులు ఆధారపడి జీవిస్తున్నారని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కోరారు. పలాస టిడిపి కార్యాలయంలోని చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు జీడి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కలను రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.16 వేలుకే ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తిత్లీ తుపాను మూలంగా నష్టపరిహారం అందని ఏడు వేల మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కేరళ మాదిరిగా జీడి కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వంశధార కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు తాగునీరు, సాగునీరు అం దించాలన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో దాసరి శ్రీరాములు, కిక్కర ఢిల్లీరావు, అప్పారావు పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

చంద్రబాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస టిడిపి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మండలంలోని పెద్దమురాహరిపురంలో మాజీ ఎంపిపి, సర్పంచ్ గొరకల వసంతస్వామి ఆధ్వర్యాన మంగళశారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మాజీ సర్పంచ్ కలిశెట్టి పార్వతి గోపాల్ దంపతులు, వార్డు మెంబర్లు కలిపి సుమారు 200 మంది టిడిపిలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓట్ వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షులు పుచ్చ శోభారాణి, జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ దుర్గారావు, సీనియర్ నాయకులు దువ్వాడ హేంబాబు చౌదరి, దువ్వాడ లక్ష్మి భార్గవి, ఎంపిటిసి గొరకల వసంతరావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గర్తం దానేశ్, కణితి సురేష్, పి.సాంబమూర్తి, గోవింద పాపారావు, నర్తు దాలేష్, జి.మాధవరావు, బి.పోలయ పాల్గొన్నారు.

చెరువులకు నీటిని విడుదల చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలకలింగుపురం, మర్రిపాడు-సి గ్రామాల చెరువుల్లో నీరు లేకపోవడంతో మూగజీవాల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆయా గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు తహశీల్దార్ జానకమ్మ, ఎంపిడిఒ భాస్కరరావులకు వేర్వేరుగా మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముగజీవాల నీటి కోసం సుదూర ప్రాంతాలకు తరలించి నీటికోసం అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నీటి కుండీల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, పెంపకదారుల సంఘం అధ్యక్షులు దుక్క బాలరాజు, టి.శేషగిరిరావు, తలగాన కృష్ణారావు, దుక్క పున్నయ్య, మామిడి గణేష్, బతకల పద్మనాభం, బుడ్డ చెన్నయ్య, బుడ్డ మాధవరావు, మామిడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చంద్రబాబుతో 'గౌతు' కుటుంబసభ్యులు

'గౌతు' ఇంటికి చంద్రబాబు

పలాస: టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష నివాస గృహాన్ని సందర్శించారు. ఆయనకు మాజీ మంత్రి గౌతు శివాజీ, విజయలక్ష్మి దంపతులు, యార్లగడ్డ వెంకన్న చౌదరి, గౌతు శిరీష దంపతులు సాదరంగా స్వాగతం పలికారు.

రహదారికి మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని జాతీయ రహదారి బెజ్జపల్లి కూడలి నుంచి మాలపేట, బెజ్జిపల్లి పోతులూరు, చిన్నతామరపల్లి బిటి రోడ్డుకు మెక్షమెప్పుడని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. ఆరేళ్లయిన నిర్మాణానికి నోచుకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2018 జనవరి నెలలో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో 5.56 కిలోమీటర్ల పొడవు గల ఈ రహదారికి శంకుస్థాపన చేశారు. రహదారి పనులు ప్రారంభమై గ్రావెల్ వేసి క్రషర్ బుగ్గి వేసి పనులు ప్రారంభించారు. కానీ, బిటి రోడ్డు వేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారు. అనంతరం ప్రభుత్వం మారడంతో పనుల్లో జాప్యం ఏర్పడింది. అయితే గడిచిన ఐదేళ్లగా పనులు జరుగుతాయని ఎంతగానో ఎదురు చూశారు. అయినా బిటి రోడ్డుకు నోచుకోకపోవడంతో నిట్టూర్పులతోనే ప్రజలు, వాహనదారులు ప్రయాణం సాగిస్తున్నారు. ఇటు మండల కేంద్రానికి రావాలంటే ఆ రహదారే ఆధారం. ఇంత ప్రాధాన్యత ఉన్న రోడ్డును బిటి రహదారిగా మార్చాలని కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

మాట్లాడుతున్న బమ్మిడి పోలీసు

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

టెక్కలి : కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని విశ్రాంత ప్రిన్సిపాల్ బమ్మిడి పోలీసు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బికాం చదువుతున్న విద్యార్థులు మంగళవారం నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కామర్స్‌కు భవిష్యత్ ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలతో పాటు ప్రస్తుత పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, త్రినాథరావు, దుర్యోధనరావు, రామరాజు, సింహాచలం, మల్లేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కామేశ్వరరావు

పలాస సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థిగా కామేశ్వరరావు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల బరిలో తాము దిగుతున్నామని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు పోతనపల్లి కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పలాసలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డిఎ అభ్యర్థులను, వైసిపి అభ్యర్థులను ఓడించేందుకు తమ పార్టీ ఎన్నికల బరిలో దింపిందని అన్నారు. మూడు నక్షత్రాలు జెండా గుర్తుకు ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల మల్లేశ్వరరావు, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి అప్పారావు, దున్న శ్రీనివాసరావు, నెయ్యల రామకృష్ణ, మదిల నారాయణ, కుత్తుమ లోకనాథం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రాజీనామా చేసిన వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలో నగరంపెల్లి, మెట్టూరు సచివాలయం పరిధిలోని 23 మంది వాలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయం సెక్రటరీ అప్పారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ... సేవలందిస్తున్న వాలంటీర్ల విధులను కోర్టుల ద్వారా అడ్డుకొని ప్రజా సంక్షేమానికి ఆటంకం కలిగించిన ప్రతిపక్షాల కుట్రలను ఖండిస్తూ రాజీనామాలు చేస్తున్నామని తెలిపారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన పది మంది వాలంటీర్లు రాజీనామా పత్రాలను కమిషనర్ రమేష్‌కు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి మద్దతుగా ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బి.జి.పుట్టుగ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లు మంగళవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. అనంతరం సర్పంచ్ బద్రి ప్రకాష్‌ను కలిసి ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు.

పట్టణ ప్రజల దాహార్తి తీరేనా !

- తాగునీటి కోసం శివారు వార్డు ప్రజల ఎదురుచూపులు
- మాటలకే పరిమితమైన పాలకులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 23 వార్డుల్లో శివారు వార్డుల ప్రజలకు తాగునీరు ఎండమావిలా తయారయ్యింది. శివారు వార్డులైన ఒకటవ వార్డు పరిధిలోని తిమ్మాపురం, జగ్గుశాస్త్రుల పేట, పార్వతీశంపేట, నాలుగో వార్డు పరిధిలోని గేదెలవానిపేట, కసింవలస, ఐదవ వార్డు పరిధిలోని రెడ్డి పేట, సొట్టవాని పేట, పంతులపేట, ఆరవ వార్డు పరిధిలోని సప్తపురాలైన నందగిరిపేట, తురకపేట, పంతులుపేట, తెలగ మనయ్యపేట, కాళింగ మన్నయ్యపేట, ఏడవ వార్డు పరిధిలోని చింతాడ, చింతాడ కాలనీ, 21వ వార్డు పరిధిలో కుద్దిరాం, మెట్టెక్కి వలసలోని కొన్ని ప్రాంతాల్లో నేటికీ మంచినీటి కుళాయిలు లేక ట్రాక్టర్లతో అరకొరగా ఆ వార్డుల్లోని ప్రజలకు మున్సిపల్ అధికారులు తాగునీరు అందిస్తున్నారు. సమితిల పాలన కాలం నుంచి నేటివరకు ప్రజలకు తాగునీరు అందించలేని దౌర్భాగ్యపు స్థితిలో పాలకులు ఉండడం సిగ్గుచేటని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలకు తాగునీరు అందించే పేరుతో అధికారులు ట్రాక్టర్లు రిపేర్ల పేరుతో నిధులను స్వాహా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా నిత్యం నీరందించకుండా మూడు రోజులకు ఒకసారి నీటిని పంపిణీ చేస్తున్నారని ఆయా వార్డుల మహిళలు వాపోతున్నారు. అన్ని వార్డుల ప్రజలు చెల్లించినట్లే తాము కూడా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నామని, తమకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించలేక అధికారులు చేతులెత్తేస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40 వేలకు పైగా జనాభా ఉన్న మున్సిపాలిటీలో నీటి సరఫరా కలగానే మిగిలిందని పట్టణ ప్రజలు పాలకులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు పట్టణ ప్రణాళిక విభాగం కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన అరకొర నిధులను మంజూరు చేయడంతో

పార్వతీశంపేట వద్ద మూలకు చేరిన పైపులు

ప్రజలకు అందాల్సిన నీటి పథకాలు అట్టడుగు స్థాయిలోనే నిలిచిపోతున్నాయి. ఒకపక్క నిధులు విడుదలవుతున్నప్పటికీ ప్రణాళిక బద్ధంగా ప్రజలకు తాగునీరు అందించడంలో వరుస వైఫల్యాలు ఎదురవుతున్నాయి. 2018లో రూ.40 కోట్లుతో పట్టణ శివారు వార్డులకు తాగునీరు అందించేందుకు నిధులు మంజూరైనప్పటికీ కార్యరూపం దాల్చక ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

2019లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గత ప్రభుత్వ పథకాలను పూర్తిగా నిలిపి వేయడంతో శివారు వార్డుల ప్రజలకు తాగునీటి కల కలగానే మిగిలిపోయింది. ఒక వ్యక్తికి సుమారు 120 నుంచి 150 లీటర్ల తాగునీరును అందించాల్సి ఉన్నప్పటికీ అందించ లేకపోతున్నారు. దాంద్రాసి మెట్ట, మున్సిపల్ కార్యాలయం వద్ద మంచి నీటి ట్యాంకులు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో మంచి నీటిని అందించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటు వంశధార నది నుంచి వచ్చిన నీరు మెట్టెక్కివలస, కృష్ణాపురం, మార్కెట్, గేటు, వెంగళరావు కాలనీ వంటి ప్రాంతాలకు సరఫరా అవుతుంది. అటు నాగావళి నది నుంచి వచ్చిన నీరు లక్ష్ముడు పేట, వెంకయ్య పేట, బొడ్డేపల్లి పేట వంటి వార్డులకు సరఫరా అవుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో మంచి నీటిని ప్రజలకు అధికారులు అందించలేకపోతున్నారు. వంశధార నాగావళి నదులు వద్ద ఉన్న పంపుసెట్ల మోటార్ల సామర్థ్యం చాలడం లేదని ఒక్కోసారి మోటార్లు మొరాయిస్తే ఒకటి రెండు రోజులు వార్డులకు మంచినీటి సరఫరా నిలిచిపోతుంది. దీనికి తోడు పట్టణంలో సగానికి పైగా బడాబాబులు కొళాయిలకు మోటార్లు పెట్టి నీటి చౌర్యం చేస్తున్నప్పటికీ రాజకీయ ఒత్తిడులతో మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో నియంత్రణ చేయలేక చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాంద్రాసి మెట్ట వద్ద మూడు ట్యాంకులు 1200 కెఎల్ఆర్, మున్సిపల్ ఆఫీసు వద్ద ఉన్న ఒక ట్యాంకు 500 కెఎల్ఆర్, వెంకయ్యపేట వద్ద ఉన్న నీటి ట్యాంకు 250 కెఎల్ఆర్ సామర్థ్యం కలిగి ఉన్నాయి. హుదూద్ పట్టణ గృహ నిర్మాణ పథకం తిమ్మాపురం వద్ద 512 జి ప్లస్ వన్ గృహాలకుగాను రూ.కోటి 33 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మించినప్పటికీ నీరు అక్కడకు సరఫరాకాక ఆ ట్యాంకు నిరూపయోగంగా మారింది. నేటికీ శివారు వార్డులైన 1,4,5,6,7 వార్డులకు మంచినీటి కొళాయిలు లేక మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా మున్సిపల్ అధికారులు అక్కడి ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తున్నారు. గతంలో టిడిపి హయాంలో అప్పటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సుమారు రూ.33 కోట్లతో శంకుస్థాపన చేసినప్పటికీ అవి కూడా పనులు ప్రారంభం కాక మధ్యలోనే నిలిచిపోయాయి. అలాగే 2020 సంవత్సరంలో ప్రస్తుత స్పీకర్ తమ్మినేని సీతారాం ఎఐఐబి నిధులతో 61.38 కోట్లతో అన్ని వార్డులకు మంచినీటి సదుపాయం కల్పించి ఇంటి కొళాయి కనెక్షన్లకు ఎఎంఆర్ మీటర్లు అమర్చుటకు పట్టణంలో పాలపోలమ్మ గుడివద్ద శంకుస్థాపన చేశారు. ఆ పనులు కూడా ఆదిలోనే ప్రారంభమై నిలిచిపోవడంతో పట్టణ ప్రజల నీటి కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. మున్సిపాలిటీ ఏర్పడి నేటికి 30 ఏళ్లు కావస్తున్నప్పటికీ ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్పా ప్రజల కనీస అవసరమైన మంచినీటి కష్టాలు మాత్రం తీరడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారుల్లు మాటలు కట్టిపెట్టి ప్రజలకు కనీస అవసరమైన తాగు నీటిని చిత్తశుద్ధితో అందించాలని కోరుతున్నారు.

ఎఐఐబి నిధులతో వేసిన శిలాఫలకం

నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం

గడచిన కొన్నేళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. పాలకులు, అధికారులు హామీలే తప్పా పూర్తిస్థాయిలో నేటి వరకు సమస్యను పరిష్కరించ లేకపోయారు. ఒక్కోసారి రెండు మూడు రోజులు కొళాయిలు రాకపోవడంతో మంచి నీటిని కొనుగోలు చేసుకుంటున్నాం.

దుప్పల పద్మావతి, పాతినవారి వీధి, ఆమదాలవలస

శిలాఫలకాలకే పరిమితం

సమితుల కాలం నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందినప్పటికీ పాలకులు తాగునీటి విషయంలో ప్రజలను మోసం చేశారు. నాయకులు ఎన్నికల ముందు ఉపన్యాసాలు ఇచ్చి ఎన్నికలయ్యాక తాగునీటి సమస్యను శిలాఫలకాలకే పరిమితం చేస్తున్నారు. పాలకులు చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించాలి.

బొడ్డేపల్లి జనార్ధనరావు, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

అభ్యర్థుల ఖర్చులు పక్కాగా నమోదు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచే అభ్యర్థుల ఖాతాలో ఖర్చు లెక్కించేందుకు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్ఒలు, నోడల్ అధికారులతో సాధారణ ఎన్నికలకు నిర్వహణకు సంబంధించిన సన్నద్ధతపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచి అతని ఖాతాలో పక్కాగా ఖర్చు నమోదు చేయాలని చెప్పారు. సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వినియోగిస్తున్న వాహనాలు, ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చు సైతం అభ్యర్థి ఖాతా కిందకే వస్తుందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సమావేశాలు, సభలు నిర్వహిస్తే ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేయాలని సూచించారు. జిల్లాకు ముగ్గురు ఐఆర్ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని తెలిపారు. ఒకరు పార్లమెంటుకు, మిగిలిన ఇద్దరూ అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

సభలు, సమావేశాలు జరిగిన 24 గంట్లలోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని, ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు. సమావేశాలకు అనుమతినిచ్చే విభాగం, ఎంసిఎంసి, ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, సంబంధిత ఇతర బృందాలతో సమన్వయం చేసుకొని ఖర్చులు నమోదు చేయాలని సూచించారు. 48 గంటలు దాటినా కొన్ని శాఖలు రోజువారీ ఎన్నికల నివేదికలు అందజేయడం లేదని, ఇకపై అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలకు బుధవారమే ఆఖరి రోజు అని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ సమయం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మాత్రమేనని, మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని, డిఎస్‌పి స్థాయి అధికారి బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్ఒలు నూరుల్ కమర్, భరత్‌నాయక్, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్‌దొర, అప్పారావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్, చల్లా ఓబులేసు, గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు పత్రాన్ని చూపిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గ్రీన్ స్కూల్‌గా బుడుమూరు పాఠశాల

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో నిర్వహిస్తున్న మొక్కల పెంపకం, వివిధ అంశాలపై ప్రజలను చైతన్య పరుస్తూ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలు, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలకు గాను గ్రీన్‌స్కూల్‌గా ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు తెలిపారు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ న్యూఢిల్లీ చేసిన ఆడిట్ ద్వారా ఈ ఘనత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన పాఠశాల గ్రీన్ కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావును అభినందించారు. రాష్ట్రంలో 12 పాఠశాలలకు మాత్రమే ఈ గుర్తింపు లభించగా జిల్లాలో బుడుమూరు పాఠశాలకు మాత్రమే ఈ గుర్తింపు లభించింది. పాఠశాలకు గుర్తింపు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

19న గురుకులంలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

జిల్లాలో పెద్దపాడు సమీపాన గల డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థినులకు మిగులు సీట్లు భర్తీకి ఈనెల 19న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7093345619, 9000314209 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

బూర్జ: 2024 ప్రవేశ పరీక్ష రాసి మెరిట్ లిస్టులో పేర్లు ఉన్న విద్యార్థులు గురువారం ఎచ్చెర్ల మండలం దుప్పలవలసలో ఉన్న బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో నిర్వహించు కౌన్సిలింగ్‌కు విద్యార్థులు హాజరుకావాలని కొల్లివలస అంబేద్కర్ గురుకుల ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తగిన పత్రాలను తీసుకొని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

వైసిపిలోకి మాజీ ఎంపిపి

ప్రజాశక్తి- పలాస

స్థానిక మంత్రి కార్యాలయంలో మంగళవారం మాజీ ఎంపిపి బత్తిని హేమేశ్వరరావు, ఆయన సతీమణి, ఎంపిటిసి మాజీ సభ్యులు బత్తిన రూపావతి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి బత్తిని హేమేశ్వరరావు మాట్లాడుతూ పలాస నియోజకవర్గాన్ని గత పాలకులు అభివృద్ధిని గాలికొదిలేసి, తమ సొంత ప్రయోజనాలు చూసికూన్నారని ఆరోపించారు. మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన అభివృద్ధి చూసి పార్టీలో చేరానని చెప్పారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, వైఎస్ చైర్మన్ బోర కృష్ణారావు, దువ్వాడ రవికుమార్, కొర్ల సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు